క్లుప్తంగా

విరాళం అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి దత్త కోటిలింగేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం ఆత్మకూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రవికుమార్ యాదవ్ రూ.27,116 విరాళం అందజేశారు. ఆలయంలో కోటిలింగాల ప్రతిష్ఠాపన,, ధ్యాన కేంద్రం, పంచలోహ లింగం ఏర్పాటుకు తనవంతుగా విరాళం అందజేసినట్లు తెలిపారు. ఆలయంలో చేపట్టనున్న కార్యక్రమాలకు దాతలు సహకరించాలని ఆలయ నిర్వాహకుడు శేఖరయ్య కోరారు.

నేడు పంచాయతీ భవనాలు ప్రారంభం

కొత్తకోట రూరల్: మండలంలోని నాచారంపేట, విలియంకొండ, సంకిరెడ్డిపల్లి, అమడబాకుల, సత్యహళ్లి, ఈదులబావితండా, నిర్వేన్, కనిమెట్ట గ్రామాల్లో నిర్మించిన పంచాయతీ భవనాలను సోమవారం ప్రారంభించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్యవైశ్య కమిటీ ఎన్నిక



మరికల్: ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడిగా సత్యనారాణశెట్టి, యువజన సంఘం అధ్యక్షుడిగా రమేష్‌శెట్టి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో ఆర్యవైశ్యులు చేపట్టిన సేవా కార్యక్రమాలను ముమ్ముందు మరింత విస్తృతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని నూతన అధ్యక్షుడు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి ఆర్యవైశ్య సంఘం మండల, యువజన అధ్యక్షుడిగా ఎన్నుకున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, సింహచలం, శేషాద్రి, ప్రకాష్, యాదగిరి పాల్గొన్నారు.

రథయాత్ర ప్రారంభం



మక్తల్: దేశం, ధర్మం కోసం నేటి యువతను జాగృతం చేసేందుకు భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో చేపట్టిన శౌర్య జాగరణ రథయాత్రను వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్య ఆదివారం ప్రారంభించారు. ముందుగా పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 14 వరకు యాత్ర ప్రతి గ్రామంలో కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సత్యనారాయణ, భీమేష్, రాములు, శ్రీనివాసులు, రాహుల్, నవీన్, నాగరాజ్, శివ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కోడేరు: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన యువకులు ఆదివారం మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా జూపల్లి వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పత్తి రైతు కుదేలు

- ఎర్రబారుతున్న తెల్లబంగారం
- వర్షాభావ పరిస్థితులతో తీవ్ర నష్టం
- ఆందోళనలో అన్నదాతలు



రాంరాయనిపల్లిలో ఎర్ర తెగులు సోకిన పత్తిపంట

ఖిల్లాఘనపురం: పత్తి రైతు కుదేలవుతున్నాడు. ఎంతో ఆశతో సాగు చేసిన పత్తి పంటకు ఆది నుంచి గడ్డుకాలం ఏర్పడటంతో ఆందోళన చెందుతున్నాడు. మొదట్లో వర్షాలు సక్రమంగా కురువకపోవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తలేదు. రెండు, మూడు సార్లు విత్తనాలను విత్తుకోవాల్సి వచ్చింది. ఎలాగోలా పత్తిపంట మొలకెత్తగా.. వర్షాభావ పరిస్థితులతో గిడుసుబారి పోతోంది. పంట పెరుగుదల నిలిచి తీవ్ర నష్టాన్ని తెచ్చి పెట్టింది. ఒక్కో మొక్కకు కేవలం 20నుంచి 30 కాయల వరకు మాత్రమే ఉన్నాయని రైతులు వాపోతున్నారు.

2,370 ఎకరాల్లో సాగు..

ఖిల్లాఘనపురం మండలంలో ఈ ఏడాది 2,370 ఎకరాల్లో పత్తిపంట సాగు చేశారు. అల్లమాయపల్లి, రాంరాయనిపల్లి, అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం, మామిడిమాడ గ్రామాల్లో రైతులు ఎక్కువగా పత్తి పంట వేశారు. వర్షాలు లేకపోవడంతో మొక్కల ఎదుగుదల తగ్గి పంట దిగుబడి సగానికి పడిపోయింది.

ఎర్రతెగులుతో నష్టం..

వర్షాభావ పరిస్థితులకు తోడు పత్తి పంటకు ఎర్ర తెగులు సోకడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పంట మొత్తం ఎర్రబారి ఆకులు రాలిపోవడంతో పాటుగా మొక్క కుళ్లిపోతోంది. రూ.లక్షలు వెచ్చించి సాగు చేసిన పత్తి పంట ఎర్రబారి ఎండుతుంటే రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంటను కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఈ సంవత్సరం కనీసం పెట్టుబడి కూడా వస్తుందో లేదోనని ఆందోళనకు గురవుతున్నారు.

క్వింటా రూ.6,100 మాత్రమే..

గతేడాది పత్తి క్వింటాకు రూ.7,500 నుంచి రూ.8,500 వరకు ధర పలికింది. ఈ సంవత్సరం కేవలం రూ.6,100 ధర మాత్రమే పలుకుతోంది. వర్షాభావ పరిస్థితులతో పంటలు దెబ్బతినడం, మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌కు పత్తిని తరలించేందుకు రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతుండటంతో చేసేదిలేక గ్రామాలకు వచ్చే వ్యాపారులకే విక్రయిస్తున్నారు. పత్తికి కనీసం రూ.10వేల ధర వచ్చేలా చూడాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పెట్టుబడి వచ్చేలా లేదు..



ఈ సంవత్సరం మా స్వంత పొలం 1.5 ఎకరాలతో పాటుగా 6 ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తిసాగు చేశా. మొదట్లో పంట బాగుంది అన్పించినప్పటికీ.. కాయొచ్చే సమయంలో వర్షాలు లేకపోవడంతో గిడుసు బారింది. ఇప్పటి వరకు పెట్టుబడి సుమారు రూ.2.3లక్షలు అయ్యాయి. పెట్టుబడి వస్తుందో లేదో చూడాలి.

– బాలపీరు, రైతు, అప్పారెడ్డిపల్లి

అన్నివర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుఖేశిని

కొత్తకోట: అన్నివర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని అన్నారు. మున్సిపాలిటీలోని 13వ వార్డులో గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు ఆదివారం ప్రొసీడింగ్స్ అందజేశారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా మాయమాటలు చెప్పే పార్టీలను నమ్మవద్దని కోరారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పి.విశ్వేశ్వర్, కౌన్సిలర్ రామ్మోహన్‌రెడ్డి, గాడీల ప్రశాంత్, కోఆప్షన్ సభ్యుడు వసీంఖాన్, నరేందర్‌సాగర్, వినోద్‌సాగర్, రవీందర్‌రెడ్డి, మజీద్, మతీన్, కృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



రజక సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

వీపనగండ్ల: కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు సింగిల్‌విండో వైస్‌చైర్మన్ సరిత, సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కల్వరాలలో ఆదివారం రజక సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో రజక సంఘం భవన నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు ఎండీ సర్దార్, రవీందర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ విద్యాసాగర్, రజక సంఘం అధ్యక్షుడు ఎల్లయ్య, శ్రీనివాసులు, రాజు, కుమార్, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన మోదీతోనే సాధ్యం



ఖిల్లాఘనపురంలో మాట్లాడుతున్న అనుజ్ఞారెడ్డి

ఖిల్లాఘనపురం: దేశంలో అవినీతి రహిత పాలన అందించడం ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమని బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి అన్నారు. రాష్ట్రంలో రూ.889 కోట్లతో సమ్మక్క–సారక్క గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతగా ఆదివారం మండల కేంద్రంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటగా ఓ గిరిజన మహిళను రాష్ట్రపతిని చేసిన ఘనతత బీజేపీదని అన్నారు. అవినీతిలో కూరుకుపోయిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించి, బీజేపీని ఆదరించాలని కోరారు. అనంతరం మామిడిమాడ ముందరితండా, వెనకితండా, బక్కతండా, రోడ్డుమీది తండాలకు చెందిన సుమారు 200మంది యువకులు, మహిళలు బీజేపీలో చేరగా, ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆశన్న, మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్, దశరథ్, సత్యనారాయణ, గోపి, రవి నాయక్, గోపాల్‌రెడ్డి, ఈదమ్మ, శాంతమ్మ, రవీంద్రాచారి, భద్రయ్య, కేశన్న పాల్గొన్నారు.

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

వీపనగండ్ల: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇటీవల ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకాన్ని అర్హులైన కులవృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా నాయకులు రామన్‌గౌడ్, మండల అధ్యక్షుడు రాకేష్‌యాదవ్, శివాజీ, నారాయణ ఆదివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కులవృత్తిదారులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనందిస్తుందని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

‘గృహలక్ష్మి’లో అర్హులకు అన్యాయం



రేచింతలలో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఆత్మకూర్: గృహలక్ష్మి పథకంలో అర్హులకు అన్యాయం చేస్తున్నారని రేచింతల గ్రామస్తులు ఆరోపించారు. ఆదివారం రేచింతలలో బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయాలని ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ప్రవేశపెడితే, ఇళ్లు ఉన్నోళ్లకే మంజూరు చేశారని ధ్వజమెత్తారు. ఎంతో మంది పేదలకు పక్కా గృహాలు లేక గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారికి గృహలక్ష్మి పథకం మంజూరు చేయకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. కేవలం అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలకే ప్రభుత్వ పథకాలను వర్తింపజేయడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మన్యం, బాలయ్య, ఆంజనేయులు, మహేష్, రాములు, భాస్కర్, తిరుపతయ్య, యాదయ్య, శేఖర్, కృష్ణయ్య, రాంచంద్రయ్య, రమేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: మండలంలోని గుమ్మడం గ్రామానికి చెందిన స్వాములు ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు, ఆవుల కురుమూర్తి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా స్వాములు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సూచన మేరకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. పెంచికలపాడు సర్పంచ్ గోవిందు నాయుడు, ఉపసర్పంచ్ రవి, చెన్నయ్య, ఆంజనేయులు, మధు, వెంకటస్వామి, నర్సింహ, గోవిందు, వెంకటయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలి

మక్తల్: నియోజకవర్గ కేంద్రమైన మక్తల్‌తో పాటు ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు మండలాలను డివిజన్ కేంద్రాలుగా ఏర్పాటు చేయాలని గతంలో ఉద్యమాలు చేసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. నియోజకవర్గంలో కోర్టు ఏర్పాటు చేయాలని వినతి ఇచ్చినా స్పందించలేదన్నా రు. మక్తల్, ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్‌లు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

హైదరాబాద్ తరలిన ముదిరాజ్‌లు



కనిమెట్ట నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన ముదిరాజ్‌లు

కొత్తకోట రూరల్: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ముదిరాజ్ ఆత్మగౌరవ సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి ముదిరాజ్ కులస్తులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ అధికార బీఆర్‌ఎస్ పార్టీ ముదిరాజ్‌లకు ఒక్క ఎమ్మెల్యే టికెట్ కూడా కేటాయించకపోవడం బాధాకరమన్నారు. రెండు దఫాలుగా ముదిరాజ్ కులస్తులు బీఆర్‌ఎస్‌కు అండగా ఉండి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేసినా గుర్తింపు ఇవ్వకపోవడం తగదన్నారు. అధికార పార్టీకి ముదిరాజ్ కులస్తుల సత్తా ఏంటో చూపుతామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

అమరచింత: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం సాగిస్తామని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభాకర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎస్.రమేష్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివారం మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంఆర్ కార్మికులను రెగ్యులరైజ్ చేసే వరకు ఉద్యమాన్ని విరమించబోమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు అన్ని కార్మిక చట్టాలను వర్తింపజేయాలని, భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బోర్డులో మున్సిపల్ కార్మికులను సభ్యులుగా చేర్చి పథకాలు అందేలా చూడాలన్నారు. కార్మికులకు రూ.21వేల వేతనంతోపాటు రూ.25లక్షల బీమా సౌకర్యం, రూ.15లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రేమ్‌కుమార్, హరికృష్ణ, తిప్పన్న, సునీల్, నాగరాజు, కాకి శ్రీను, మహేందర్, నాగమ్మ, మాధవి పాల్గొన్నారు.

నందిపేటలో ఇరువర్గాల ఘర్షణ



అడ్డాకుల: నందిపేటలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు, గృహలక్ష్మి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమం అనంతరం ఆయన వెళ్తుండగా కాంగ్రెస్ నాయకులు అడ్డు వెళ్లి చాలా మంది అనర్హులకు ఇళ్ల స్థలాలు, గృహలక్ష్మి పత్రాలను మంజూరు చేశారని ప్రశ్నించారు. ఈక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు ఆయన ఎదుటే తోపులాటకు దిగారు. ఎమ్మెల్యే వెళ్లిపోయిన తర్వాత కూడా ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. ఒకరినొకరు దూషించుకుంటూ తోపులాడుకున్నారు. లబ్ధిదారులతో బీఆర్‌ఎస్ నాయకులు డబ్బులు వసూలు చేశారని కాంగ్రెస్ నేతలు ఆరోపించడంతో వాతావరణం మరింత వేడెక్కింది. అరగంట పాటు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈక్రమంలో పోలీసులు ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించి తోపులాటను అడ్డుకున్నారు.

క్రీడలను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం



స్పోర్ట్స్ కిట్ అందజేస్తున్న సర్పంచ్ చెన్నయ్య

నర్వ: గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తోందని సర్పంచ్ చెన్నయ్య అన్నారు. మండలంలోని ఎల్లంపల్లిలో యువకులకు స్పోర్ట్స్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీలో క్రీడాప్రాంగణం ఏర్పాటు చేయడంతో పాటు యువకులకు క్రీడాసామగ్రిని అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. యువత క్రీడల్లో ప్రావీణ్యం పెంచుకొని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాగరాజు, ఏఈఓ వెంకట్రాములుగౌడ్, డీలర్ వెంకటయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ జాతర సందర్భంగా ఆదివారం భక్తులు పోటెత్తారు. యాసంగి సీజన్ పనులు ప్రారంభం కావడంతో రైతులు, వ్యవసాయ కూలీలు వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేట్ వాహనాలలో పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గద్వాల, పెబ్బేరు, వనపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల నుంచి భక్తులు తరలిచ్చారు.

రక్తదాన శిబిరం ప్రారంభం

పెద్దకొత్తపల్లి: పట్టణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం శిబిరంలో 52 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైద్యుడు వంశీకుమార్, శబ్బీ, ఖాజా, ఖలీల్, వికార్, ఖయ్యూం, శేఖర్, జగదీష్, పృథ్వీరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి శంకుస్థాపన



తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆర్డీఓ

కోడేరు: మండల కేంద్రంలో రూ.1.75 కోట్లతో నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి ఆదివారం ఆర్డీఓ నాగరాజు శంకుస్థాపన చేశారు. పనులు త్వరగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, డిప్యూటీ తహసీల్దార్ జయలక్ష్మి, ఆర్ఐ సురేందర్, ఎస్ఐ శేఖర్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సురేష్‌శెట్టి, పర్వత్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్లెల రూపురేఖలు మారాయి



అచ్చాయపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

అడ్డాకుల: కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయడానికి బీఆర్‌ఎస్ శ్రేణులు కృషి చేయాలని, తనను మరోసారి ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలంలోని తాళ్లగడ్డ, అచ్చాయపల్లి, జానంపేట, పోల్కంపల్లి, నందిపేట, వేముల, మూసాపేట గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కల్యాణలక్ష్మి, గృహలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణలో లెక్కకు మించి అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. పల్లెల రూపురేఖలు మారాయని, అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించామన్నారు. ఓట్ల కోసం వచ్చే ప్రతిపక్షాల మాటలను నమ్మవద్దన్నారు. తప్పుడు హామీలతో ప్రజలు మభ్యపెట్టేందుకు వస్తున్నారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, ఎంపీపీ కళావతి, విండో అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు లక్ష్మినర్సింహ్మ, సర్పంచులు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాసులు, అరుణ, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: దోకూర్‌కి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం అన్నాసాగర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బోయ శ్రీనివాసులు, పి.రాములు, రమేశ్‌గౌడ్, ఎస్.రాములు, నాగేశ్, సత్యన్న, ఆశన్న, అరుణ్, భాస్కర్ తదితరులు ఉన్నారు. పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి మండల నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్లెక్సీ

అడ్డాకుల: అచ్చాయపల్లిలో ఆదివారం పంచాయతీ భవన శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సర్పంచ్ బోయిని చంద్రశేఖర్ ఏర్పాటు చేయించిన ఫ్లెక్సీని చూసి ఆసక్తిగా చదివారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రామానికి వచ్చిన అన్ని రకాల పథకాలు, లబ్ధిదారులు, కేటాయించిన నిధులు, ఖర్చులతో కూడిన పూర్తి వివరాలను ఫ్లెక్సీలో పొందుపర్చడంతో ఆయనను అభినందించారు. అన్ని గ్రామాల్లో ఇలా ఏర్పాటు చేస్తే బాగుంటుందని జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్‌కు ఎమ్మెల్యే ఆల సూచించారు.